క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజా

సోమల: గృహ నిర్మాణాల పురోగతిపై ఎంపీడీఓ నాగరాజా, హౌసింగ్ డీఈ మధుసూదన్ రెడ్డి బుధవారం సమీక్షించారు. పంచాయతీల వారీగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరిగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జావీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



కొలువుదీరిన గంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని శెట్టిపల్లెలో మంగళవారం రాత్రి వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామ పొలిమేర నుంచి గంగమ్మ శిరస్సును పురవీధుల్లో ఊరేగించి, బుధవారం ఉదయం అమ్మవారి ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. సమీప గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

వేమన పద్యాలపై పోటీలు



గెలుపొందిన పిల్లలతో నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని కళామందిరంలో యోగి వేమన పద్యాలపై బుధవారం పోటీలు నిర్వహించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పోటీల్లో ఎక్కువ పద్యాలు వల్లించిన 15 మంది పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకుడు తులసీనాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు పొంగళ్లు




అమ్మవారికి ఆలయానికి వెళుతున్న భక్తులు

రామకుప్పం: మండలంలోని కంబాలదేవులపల్లె, అత్తికుప్పంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం గ్రామ దేవతకు పొంగళ్లు సమర్పించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఊరేగింపుగా చౌడేశ్వరిదేవి ఆలయానికి చేరుకుని పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు.

రోడ్డు భద్రతపై వారోత్సవాలు

పలమనేరు: రోడ్డు భద్రతా వారోత్సవాలను రవాణాశాఖ అధికారులు బుధవారం ప్రారంభించారు. ఎంవీఐ శివారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్లు ఆవిష్కరించారు. రహదారి భద్రత– జీవితానికి రక్షణ అంటూ పోస్టర్‌లో పేర్కొన్నారు. గురువారం కుప్పంలో స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మినీ మార్కెట్ పనుల పరిశీలన



సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని శివునికుప్పం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మినీ మార్కెట్ పనులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల మేరకు నిర్మించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుష్పాంజనేయులు పాల్గొన్నారు.

అవినీతి రహితంగా పాలన

- చంద్రబాబు అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



బైరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు

బైరెడ్డిపల్లె: ఒక్క రూపాయి లంచం లేకుండా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం కుప్పం పర్యటనకు వెళుతున్న ఆయనకు బైరెడ్డిపల్లెలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ నివాసంలో తేనేటివిందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ, ఆస్పత్రుల అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందని చెప్పారు. అవినీతి రహిత పాలనను చూసి చంద్రబాబుకు మతి భ్రమించిందని ఆరోపించారు. నవరత్నాలు–సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ఎలా తగ్గించాలనే ఆలోచన చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం అర్హులైన లబ్ధిదారులు ఎవరూ నష్టపోకుండా సంతృప్తికర స్థాయిలో పథకాలు అందిస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలను పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని, ఆ విషయం గడపగడపకూ వెళ్లినప్పుడు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. లబ్ధిదారుల తలుపుతట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. చంద్రబాబు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ, ముఖ్యమంత్రి సంక్షేమ పాలనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, పార్టీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, సర్పంచులు కృష్ణారెడ్డి, వెంకటేష్, రాజప్ప, రమణారెడ్డి, బాలకృష్ణగౌడు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



పలమనేరులో ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘనస్వాగతం

పలమనేరు: పట్టణ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కుప్పం పర్యటనకు వెళుతున్న ఆయనకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించారు. పట్టణంలో గురువారం జరగనున్న వేమన విగ్రహావిష్కరణ, టెక్రకోట కాలనీలో ఆలయ ప్రారంభోత్సవానికి విచ్చేయాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు జాఫర్, బాలాజీనాయుడు, వైవీఆర్ ట్రస్టు చైర్మన్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

వి.కోట: కుప్పం పర్యటనకు వెళుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి వి.కోటలో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ప్రత్యేక ఆహ్వానితుడు ఎస్‌ఏ గౌస్, ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ బాల గురునాథ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, నాయకులు ఆంజనేయులు, అమరనాథ్ పాల్గొన్నారు.





కుప్పం : కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

టీడీపీ ఓటమికి సమష్టి కృషి

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో టీడీపీని ఓడించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. బుధవారం కుప్పంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం తాగునీరు కూడా అందించలేని చంద్రబాబును కుప్పం ప్రజలు ఇక భరించరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటే రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని వెల్లడించారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలం ఏంటో టీడీపీకి తెలిసిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో కూడా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ కలిసికట్టుగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఇంటి పట్టాలకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలో పేదలకు ఇంటి పట్టాలు అందించేందుకు స్థల పరిశీలన చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాగానిపల్లె, గూడూరుపల్లె వద్ద మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, తహసీల్దార్ సీతారామన్‌తో కలసి పలు స్థలాలను పరిశీలించామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసిన 1,002 మందికి పట్టాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 17 ఎకరాలు సేకరించామని, కలెక్టర్ అనుమతి ఇవ్వగానే పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్, సర్వేయర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు అధిక ప్రాధాన్యం



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప ఆదేశించారు. బుధవారం మండలంలోని రాయలపేట, కమ్మపాళ్యం సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూమ్‌మెంటు రిజిష్టర్ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయంలో రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఎస్ జఫ్రుల్లా, సచివాలయ సిబ్బంది బాలచందర్, అనిల్ కుమార్, సోమశేఖర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లె సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న సరోజ అనారోగ్యంతో మృతి చెందింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మృతురాలి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఎంపీడీఓ సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర, సర్పంచ్ పోకల ఉమాదేవి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు గోవిందరెడ్డి, గంగయ్య , నారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విన్నర్స్‌తో పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి

సోమల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నేత పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విజేతగా నిలిచిన సోమల డివైన్ ఫైటర్స్, రన్నర్స్ రొంపిచెర్ల జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతులు అందించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ షావలీ, మిత్ర బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణంరెడ్డి, కుమార్‌రాజా, ఐలా సురేంద్ర, షేక్ బాషా, ప్రసాద్, ముబారక్ పాల్గొన్నారు.

నేడు యోగి వేమారెడ్డి విగ్రహావిష్కరణ

పలమనేరు: పట్టణంలోని మార్కెట్‌కమిటీ వద్ద గురువారం ఉదయం 9 గంటలకు వేమారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేమన జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు వివరించారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళిక

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 51 పాఠశాలల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించామన్నారు. ఈ నెల 20వ తేదీలోపు ప్రణాళికను అందిస్తే, జిల్లా విద్యాశాఖకు పంపిస్తామని వెల్లడించారు.



సంబరాల్లో వాసవి వనిత క్లబ్ సభ్యులు

'వాసవీ' సంబరాలు

పలమనేరు: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం వాసవీ క్లబ్ ఆఫ్ వనిత వారు వేడుకగా కనుమ సంబరాలు నిర్వహించారు. మహాలక్ష్మి పూజ చేసి భోగి మంటలు వేశారు. గొబ్బెమ్మలను కొలువుదీర్చి ఆటపాటలతో ఉత్సవాలు జరుపుకున్నారు. సంక్రాంతి సంప్రదాయాలు, పండుగల ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఉష, కార్యదర్శి దీపిక పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో పంటకు రక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: మిత్ర పురుగులతో పంటకు రక్షణ ఉంటుందని ఏఓ సుధారాణి తెలిపారు. బుధవారం మండలంలోని బోడిపాటివారిపల్లెలో నిర్వహించిన పొలంబడిలో ఆమె మాట్లాడారు. పంటకు నష్టం చేకూర్చే శత్రు పురుగులను మిత్రపురుగులు నాశనం చేస్తాయన్నారు. రసాయన మందుల పిచికారీతో మిత్ర పురుగులు నశిస్తున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని వివరించారు. మిత్ర పురుగులను పెంచేందుకు పొలం చుట్టూ పసుపు రంగు పువ్వులు పూసే మొక్కలు నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్‌వలీ, వ్యవసాయ సహాయకుడు వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి

సోమల: మండల కేంద్రంలోని సచివాలయం-2లో తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది, వలంటీర్ల హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు సచివాలయ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్ బాబు, వీఆర్‌ఓ శ్రీజ, పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి పాల్గొన్నారు.

ఓటేస్తే.. వదిలేశారు!

- పల్లె సమస్యలు పట్టించుకోని తమ్ముళ్లు
- టీడీపీ తరఫున గెలిచి.. ప్రజా ప్రయోజనాలు గాలికి..
- అభివృద్ధికి దూరంగా కీలపట్ల, కల్లుపల్లె, కలగటూరు
- సర్పంచ్‌ల తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు



పంచాయతీ నీటి ట్యాంకులపై ప్రైవేటు వ్యక్తుల పోస్టర్లు



కీలపట్లలో వృథాగా పోతున్న తాగునీరు



కల్లుపల్లెలో చెత్తాచెదారంతో నిండిన మురుగునీటి కాలువ

గంగవరం: పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకం. గ్రామీణుల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. పల్లెవాసులకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు పనిచేయాల్సి ఉంటుంది. పార్టీలతో సంబంధం లేకుండా తాము ప్రాతినిథ్యం వహిస్తున్న పంచాయతీని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నిత్యం శ్రమించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సకాలంలో సక్రమంగా వినియోగించుకుంటూ ప్రజలకు సేవ చేయాల్సి ఉంటుంది. కానీ, కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ పదవులు వెలగబెడుతున్న వారు అలంకారప్రాయంగానే మిగిలిపోతున్నారు. పార్టీ ప్రయోజనాలే పరమావధిగా ఎన్నుకున్న వారిని నట్టేట ముంచుతున్నారు. ప్రభుత్వ సాయాన్ని సైతం అందిపుచ్చుకోకుండా ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. ఇందుకు గంగవరం మండలంలోని కీలపట్ల, కల్లుపల్లె, కలగటూరు పంచాయతీల సర్పంచ్‌లే నిదర్శనంగా కనిపిస్తున్నారు. టీడీపీ తరఫున గెలిచామనే సాకుతో ప్రభుత్వంపై బురదజల్లేందుకు అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారు. పేరుకున్న మురుగుతో డ్రైనేజీలు.. తాగునీటి పైపులైన్లు లీకేజీలు.. పగుళ్లు తీసిన కొళాయిలు.. అపరిశుభ్రంగా వీధులు.. అధ్వానంగా అంతర్గత దారులతో తమ పంచాయతీలను పూర్తిగా భ్రష్టు పట్టించారు. తమ అవస్థలను పట్టించుకోవాలని ప్రజలు పదే పదే విన్నవిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతున్నారు. చివరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సైతం పనిచేయనివ్వకుండా పెత్తనం చేస్తున్నారు. సదరు సర్పంచుల వ్యవహారశైలిపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఓటేసి గెలిపించినందుకు తగిన బుద్ధి చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏనాడూ పట్టించుకోలేదు



పంచాయతీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది. పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలు, పేడదిబ్బలే. మా సర్పంచ్ అస్సలు ఏనాడూ పట్టించుకోలేదు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే ఆయన ఇలా చేస్తున్నాడని తెలిసింది. ఇప్పటికైనా స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని గ్రామస్తులందరం నిర్ణయించాం. –గోపీకృష్ణ, కల్లుపల్లె

ఇంత వరకు కనిపించలేదు



మా సర్పంచ్‌ను గత ఎన్నికల ప్రచారం చూశాం. అంతే గెలిచిన తర్వాత ఇంతవరకూ కనిపించలేదు. ఆయనకు కేవలం పదవి మాత్రమే కావాలి. పంచాయతీని అభివృద్ధి పట్టడం లేదు. అప్పుడప్పుడూ పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంటారు. మా సర్పంచ్ కారణంగా మా ఊరు పూర్తిగా వెనకబడిపోయింది. –కేశవరెడ్డి, కలగటూరు

అభివృద్ధి మాటే లేదు



మా పంచాయతీలో అభివృద్ధి మాటే లేదు. సర్పంచ్ ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. పంచాయతీ కార్యాలయంలో పెద్ద కుర్చీ వేసుకుని కూర్చునే దానికే ప్రాధాన్యమిస్తున్నారు. తాను ప్రజాప్రతినిధిని అనే ధ్యాసే ఆయనకు లేదు. ఏ వీధిలో చూసినా పైపులైన్లు తాగునీరు వృథాగా పోతోంది. దీంతో దారులు బురదమయంగా మారిపోతున్నాయి. నీరు కలుషితమవుతోంది. –చంద్రబాబు, కీలపట్ల

ప్రత్యేక దృష్టి సారిస్తాం



అభివృద్ధిలో వెనుకబడిన పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ముందుగా మురుగునీటి కాలువను శుభ్రం చేయిస్తాం. పైపులైన్లకు మరమ్మతులకు చర్యలు చేపడతాం. సర్పంచ్‌లు సక్రమంగా స్పందించకుంటే ఉపేక్షించం. సకాలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఆదేశాలు జారీ చేస్తాం. ఎప్పటికప్పుడు చేసిన పనులపై నివేదికను అందించేలా జాగ్రత్తలు తీసుకుంటాం. –శివప్రసాద్, ఎంపీడీఓ, గంగవరం

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: బాల్య వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని ధర్మపురిలో చిన్నతనంలో వివాహం చేయడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. శారీరక, మానసిక ఎదుగుదల రాకముందే పెళ్లి చేస్తే మాతా, శిశు మరణాలు సంభవించే ప్రమాదముందని హెచ్చరించారు. అలాగే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

ప్రతి ఉద్యోగికీ ముఖ హాజరు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ముఖ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని విభాగాల అధిపతులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ హాజరు తప్పనిసరి చేసిందన్నారు. ఇందులో ఏపీఎఫ్ఆర్‌ఎస్ యాప్‌లో పేరు నమోదు చేసుకొని హాజరు కచ్చితంగా వేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెలవుకోసం అనుమతి తీసుకుంటే ఆన్‌లైన్‌లో కచ్చితంగా అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. శాఖల వారీగా విధులకు దీర్ఘకాలిక గైర్హాజరైన వారిపై చర్యలు చేపట్టాలని, అలాంటి ఫైల్స్ ఉంటే వెంటనే పంపాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పీఆర్,ఆర్–బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్ర శేఖర్ రెడ్డి, దేవానందం, నాగ జ్యోతి, హౌసింగ్ పీడీ పద్మ నాభం, సీపీఓ ఉమాదేవి, డ్వామా పీడీ గంగా భవాని, డీపీఓ లక్ష్మి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, చిన్నారెడ్డి మూర్తి ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పలమనేరు: పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని స్థానిక టీడీపీ నేతలు బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు తాతయ్య నాయుడు ఆధ్వర్యంలో అంజలి ఘటించారు.